# రియాక్షనరీ కథ




చిన్నతనాన రెండో తరగతిలోనో, మూడో తరగతిలోనో ఒక పాఠం చదువుకున్నాడు క్రాంతికుమార్— 'అది మా పని కాదు' అని. అప్పటికి అర్థం కాలేదు. ఊహ తెలిశాక, అంటే తను అభ్యుదయ రచయిత అయ్యాక, ఆ కథ ఎంత రియాక్షనరీయో తెలుసుకున్నాడు.

ఆ కథా సారాంశ మిది: ఒక ధనికు డుంటాడు. అతని వద్ద నలుగురు పల్లకీబోయీలు పని చేస్తుంటారు. అకస్మాత్తుగా, ఒక రోజు వాళ్ళ పశువుల శాలలోంచి దూడ ఒకటి తప్పించుకు పోతుంది. వెళ్ళి వెదుక్కు రమ్మంటాడు బోయీలను. వాళ్ళు ఒకరి మొహా లొకరు చూసుకుని, 'అయ్యో! పల్లకీ మోయటమే మా పని గాని దూడను వెదకటం మా పని కాదు' అంటారు. ఉగ్రుడై పోతాడు యజమాని. వీ తిక్క కుదిర్చే విధానం నాకు తెలుసు నంటూ", 'అయితే, మీరు పల్లకీయే మోయండి, నేను పల్లకీలో ఎక్కి కూర్చుని దూడను వెదుక్కుంటాను'

— కె. చిరంజీవి

అని బయలుదేర దీస్తాడు. తిప్పుతాడు తిప్పుతాడు, తిండీ తిప్పలూ లేకుండా గ్రామ గ్రామాలూ తిప్పుతాడు. చివరి కా బోయీలు ప్రాణం కడబట్టిన వాళ్ళై, పల్లకీ మోయలేక, చేతులెత్తి నమస్కారం పెట్టి, 'దూడను వెదుక్కొస్తాం, స్వామీ, తప్పు కాచండి' అంటూ ఆ యజమాని కాళ్ళమీద పడతారు.

ఈ కథలో రచయిత చెప్పదలచిందీ, చెప్పిందీ తమ డ్యూటీ మాత్రమే తాము చేస్తామనడం తప్పు అని. అలా అనడం వల్ల అనేక అనర్థాలకు, కష్టనష్టాలకు లోనవుతా మనిన్నీ. బోయీలు వెట్టి చాకిరీ చేయడానికే పుట్టినట్లు వారి భావన. ఏ పని బడితే ఆ పని చేయించు కోవడానికి వీలుగా ఈ కథ నల్లారు. మనుషుల్ని బానిసలు చేసే కథ ఇది!

ఈ నాడైతే ఈ కథ చెల్లేనా? రోజుకు ఇన్ని గంటలే పని చేస్తాం, ఆ టైము కాగానే ఏ అరణ్యమధ్యాన ఉన్నా సరే అక్కడ పల్లకీ దించేసి, రేపు పొద్దుట డ్యూటీ ప్రకారమే టంఛనుగా పది కొట్టు తుండగానే వస్తామని చెప్పి వెళ్ళిపోతే ధనికుడి గారి పని ఏమయ్యేది? అర్ధరాత్రి, అరణ్యాన పులివాత పడ్డందుకు కోర్టుకు వెళ్ళేవాడా?

ఆ బానిసయుగం గతించి పోవడంతో ఈ కథకూడా పాఠ్యగ్రంథాల నుంచి పక్కకు తప్పుకుంది. అది వేరు మాట.

ఆ తరవాత, ఇలాంటిదే మరోకథ గుర్తు కొస్తుంటుంది క్రాంతికుమార్‌కి.

అది ప్రేమవివాహాల మీద విసురు. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం ఎంత తప్పో, ఎంత నరకం అనుభవించ వలసి వస్తుందో, అందులో వర్ణాంతర వివాహ మైతే మరెంత నరకమో వ్యంగ్యాత్మకంగా చిత్రించాడు ఒకానొక శాస్త్రోక్త రియాక్షనరీ రచయిత.

అందులో ఒక బ్రాహ్మణ అమ్మాయి తనతోపాటు కాలేజీలో చదువుకుంటున్న ఒక అబ్రాహ్మణ కుర్రాణ్ణి ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. పెళ్ళికి ముందు ఆ కుర్రాణ్ణి కాలేజీలో చూడటమే గాని, అతని ప్రైవేటు జీవిత మెలాంటిదో ఆమెకి తెలియదు. సరాసరి పడక గదిలో మంచ మెక్కడంతో ప్రారంభమవుతుంది కథ. ఈ అమ్మాయి శుచీ శుభ్రం తెలిసిన పిల్ల. ఇక ఆ కుర్రాడు, కాళ్ళు తుడుచుకోకుండానే మంచ మెక్కుతాడు. అమ్మాయి మనస్సు చివుక్కుమంటుంది. రోజూ స్నానం చేయాలన్న జ్ఞానం ఉండదా కుర్రాడికి. గడ్డం వరకు గీసుకుని పౌడ రద్దుకుంటాడు గాని, చంకల్లో బొచ్చు నలాగే పెంచతాడట! గొడ్డు గాబులో కుడితి తాగినట్లు కంచంలో మూతి పెట్టి మజ్జిగ అన్నం పీలుస్తాడట. . . ఇంకెన్నో పనులు చేస్తాడట! ఇంక కథ క్లైమాక్స్ కొచ్చేటప్పటికి, వీళ్ళ అత్త గారు అంటే మొగుడి తల్లి చుట్ట కాల్చుకుంటూ, పొయ్యి దగ్గరే ఉమ్మేస్తూ అత్తెసరు పెడుతూ ఉంటుంది. 'అయ్య బాబోయ్! నే నింక ఈ కాపరం చేయ లేను. నా వల్ల కాదు' అంటూ పుంజాలు తెంపుకుని ఒకటే పరుగుగా పారిపోతుంది, ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఆ ఉత్తమ బ్రాహ్మణ ఇల్లాలు.

ఇదీ కథ! వర్ణ వ్యవస్థ చిరస్థాయిగా ఉండి పోవాలనే పాడు కథ. చిలుము పట్టిన బుద్ధి చెంబులను చింతపండేసి తిరగతోమే పీడ కథ ఇది. సమాజం ముందుకు నడవకుండా చూసే సాహిత్య బాబాలు వీళ్ళు. పై పెచ్చు రథచక్రాలను వెనక్కి మళ్ళించాలని విఫలయత్నం చేసే రియాక్షనరీలు!

బొచ్చు అనేది అందరికీ పెరగదా? చంకలు పెంచుకునేది ఒక్క శూద్ర మొగుడేనా? ప్రేమంటే ఏమిటో తెలియకుండా, పందికొక్కుల్లా కన్నాలలోనే పెళ్ళిళ్ళు చేసుకుని, పిల్లల్ని కంటున్న మొగుళ్ళు డబ్బు దండగని వారానికో రోజు మాత్రమే గడ్డం గీయించుకుంటారేం? ఒక్క ప్రేమించి పెళ్ళి చేసుకున్న మొగుడేనా కంచాలు నాకేదీ, వేళ్ళు చీకేదీ? చుట్ట కాల్చే శూద్రతల్లి అజ్ఞానానికీ, అశుభ్రతకీ, లేమికీ జాలిపడి, సానుభూతితో సంస్కరించ వలసింది పోయి. . .

'తుపాకిని వేయాలి ఈ రియాక్షనరీ గాళ్ళను' అనుకున్నాడు క్రాంతికుమార్. పళ్ళు కోపంతో పటపట లాడాయి. తుపాకి మనస్సులోకి రాగానే ఇటీవల 'కృష్ణపక్షం' మాసపత్రికలో వచ్చిన మరో గొప్ప రియాక్షనరీ కథ గుర్తు కొచ్చింది. యథాతథంగా దాన్నిక్కడ పొందు పరుస్తున్నాను.

* * *

టెలిఫోన్ బెల్ మోగింది.

రిసీవర్ అందుకుని, 'ఎస్! అరండల్ పేట పోలీస్ స్టేషన్' అన్నాడు సబిన్స్పెక్టర్, సుబ్బారావు బొదురు గొంతుకతో.

సుబ్బారావు పోలీసు డిపార్టుమెంటులో మొదట ఆర్డర్లీగా జేసి, తరవాత కాన్‌స్టేబులై, ఆ తరవాత హెడ్ కాన్‌స్టేబులై—రిటైర్ కావడాని కింక రెండేళ్ళుండనగా—ఇప్పుడు సబిన్స్పెక్టర్ చేస్తున్నాడు.

మొన్నటిదాకా ఇది సబిన్స్పెక్టర్ స్టేషనే. తనే రాజు, తనే మంత్రి. కాని, ఆరు నెలలై కమ్యూనిస్టుల బెడదే ఎక్కువ కావడంతో ఈ స్టేషన్ని ప్రమోట్‌చేసి, కొత్త సర్కిల్ ఇన్స్పెక్టర్ ఒకాయన్ని వేశారు. ఆయన దగ్గర నేర్చు కున్నాడు ఇలా ఫోనులో ఇంగ్లీషు మాట్లాడ్డం. అంతవరకే ఇంగ్లీషు, ఆ తరవాతంతా ముక్క తెలుగులోనే మాట్లాడతాడు.

'అయ్య బాబో! మీ రేందో నదువు కున్నోరికి మల్లేనే ఉండారు. నమస్కారం' అంటూ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు సబిన్స్పెక్టర్ సుబ్బారావు.

సుబ్బారావు కుర్చీలోంచి లేవడం సీసాకు గట్టిగా బిగించబడిన కార్కును పగలకుండా, విరగకుండా తీయడం వంటి లలితకళ. ఎలాగైతేనేం, ఒక చేతో టెలిఫోన్ రిసీవర్ పట్టుకుని మరో చేత్తో కుర్చీని కింది కదిమి అతి చాక చక్యంగా లేచి నిలబడ్డ సుబ్బారావు—

'అయ్యో! సర్కిలిన్స్పెక్టరుగారు పక్క గదిలో ఉండారు. పిలవ మంటారేంది?' అన్నాడు.

అవతలి వాళ్ళు పిలవమన్నారేమో, ఫోను టేబిల్‌మీద పెట్టేసి, అటెన్షన్‌లో వచ్చి నిలబడి సెల్యూట్ కొట్టి, 'సర్! నదువుకున్నోళ్ళ కాణ్ణుంచి మీకు టెలి ఫోన్' అన్నాడు.


సర్కిలిన్స్పెక్టర్ ఆశీర్వాదం కను బొమలు పైకెత్తి చూసి, చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చి ఫోనందుకున్నాడు.

'హలో. . . అవునండీ. మీరు. . . కూచుంటాను లెండీ, చెప్పండి. . . ఎవరూ లేరండీ. ఈ హాల్లో నేనొక్కణ్ణే ఉన్నాను. ఎస్. ఐ.కూడా లేడు. అతను నా గదిలో ఉన్నాడు. చెప్పండి, ఫరవా లేదు. ఇంతకీ మీ రెవరో. . . సరే చెప్పండి, వింటాను.'

ఆఁ ఊఁ అహాఁ ఉహూఁ అంటూ పది నిమిషాల సేపు విన్నాడు. చేతిలో ఉన్న పెన్సిల్ అతని ముఖభావాల కనుగుణంగా ఆడుతున్నది.

చివరికి 'ఉండండి ఉండండి. అరుణా లాండ్రీ, పన్నెండవ లైను, అరండల్ పేట అంతేగదూ?' అని నోట్ చేసు కుంటూ, 'చాలా థాంక్సండీ. మీ లాంటి దేశభక్తులుంటే ప్రజాసేవకులుంటే — మన దేశానికి గతి పడుతుందా? తప్పకుండా నేను గాదు, మన ప్రజా ప్రభుత్వమే, దేశమే మీకు కలకాలం ఋణపడి ఉంటుంది. ఇంతకీ మీ రెవరో. . . సరేలెండి. దానికేమిటి? ఎందరో అజ్ఞాత వీరులు! నమస్కారమండీ. ఉంటాను. గుడ్ డే' అంటూ ఫోన్ పెట్టేశాడు సర్కిలిన్స్పెక్టర్ ఆశీర్వాదం.

ఆశీర్వాదం క్రైస్తవ కుర్రాడు. చాలా చురుకైన వాడూ, తెలివైన వాడూ



కావడం వల్ల ఇరవ్వైరెండో ఏటనే బి. ఎ. పాసయ్యాడు. బి. ఎ. పరీక్షా ఫలితాలు తెలిసిన వారంలోనే, సర్కిలిన్‌స్పెక్టర్ పోస్టులకు అడ్వర్టైజ్ చేస్తే, వస్తే వస్తుంది లేకుంటే లేదని అప్లయి చేశాడు. తెలివి తేటలతోపాటు ఒడ్డూ పొడుగూకూడా ఉండటం వల్ల ఏ సిఫారసూ లేకుండానే డైరెక్టుగా రిక్రూయిట్‌మెంటులో సర్కిలిన్‌స్పెక్టరుగా సెలెక్టయ్యాడు. సర్వీసులో చేరి ఇప్పటికి ఏణ్ణర్ధం మాత్రమే అయింది.

ఆశీర్వాదం కళ్ళు దేన్నో వెదుకుతున్నాయి. లోపలి పొరల్లో ఏవో ఆలోచనలు. సి. ఐ. గారు ఇంత సీరియస్‌గా ఉండటం ఎన్నడూ చూడలేదు ఎస్. ఐ. సుబ్బారావు.

'సర్!' అన్నాడు సుబ్బారావు. ఆ పైని అడిగే ధైర్యం లేకపోయింది.

సైరన్‌లాంటి సుబ్బారావు 'సర్'తో బాహ్య ప్రపంచంలో కొచ్చిన ఆశీర్వాదం తన చేతి వంక చూసుకున్నాడు. చేతిలో పెన్సిలూ, ఆ పెన్సిలు గీచిన గీతలూ! గీతల్లో తను గీచిన బొమ్మ చూశాడు. కలకత్తా కాళికలాంటి బొమ్మ! అందులో కాళిక ఆడదైతే, ఈ బొమ్మలో మగవాడు నాలుకలు సాచి వీరావేశంతో నిలబడి ఉన్నాడు. ఆవిడ మెడలో కపాల మాల వేసుకుంటే, ఈ మగవాడు తన మెడలో సుత్తీ కొడవళ్ళతో కూర్చిన మాల వేసుకున్నాడు.

'ఈ బొమ్మ తను గీచిందేనా? అసలు తను బొమ్మలు వేయగలడా? ఆశ్చర్యంగా ఉందే!' అనుకుంటూ, ఎస్. ఐ. సుబ్బారావు కళ్ళబడకుండానే ఆ బొమ్మను వలిచి, ముక్కలు ముక్కలుగా చింపి చెత్తబుట్టలో పడేశాడు ఆశీర్వాదం.

ఎవరితో ఏమీ మాట్లాడలేదు. యూనిఫార్మ్ తీసేసి, మఫ్టీలో కాలినడకను బయలుదేరాడు. జేబులోని కాగితం ముక్క తీసి మరోసారి చదువుకున్నాడు.

'అరుణాలాండ్రీ, పన్నెండవ లైను, అరండల్‌పేట.'

ఎందుకోగాని మెయిన్‌రోడ్ నుంచి వెళ్ళబుద్ధి కాలేదు ఆశీర్వాదానికి. సందుగొందుల్లోంచి నడక సాగించాడు. ఎవరూ తనను చూడకూడదు, చూసినా గుర్తుపట్టకూడదు, గుర్తుపట్టినా తన ముఖభావాలు చదవకూడదు అనుకుంటూ నడుస్తున్నాడు.

అగ్నిపర్వతం బద్దలైనట్లు, ఒక్కసారిగా గుండె గుభిల్లున పగిలి, ఆ ముక్కలన్నీ సర్వావయవాల్లోకీ వ్యాపించినట్లయింది! ఏమీ లేదు. ఒక పిల్ల— మిరపపండు రంగు గౌను తొడుక్కున్న ఒక చిన్నపిల్ల—ఆడుతూ పరుగెత్తుకుంటూ వచ్చి తన కాళ్ళకు కొట్టుకుంది.

'పాపం! దెబ్బ తగిలిందేమో' అన్న ఆలోచనకూడా రాలేదు ఆశీర్వాదానికి. ఆ పిల్ల నవ్వుకుంటూ, దెబ్బ తగిలిన చోట తడుముకుంటూ వెళ్ళిపోయిన కొద్దిసేపటికి స్తిమిత పడ్డాడు. మళ్ళీ నడక సాగింది. ఈ సారి బుర్రలో ఆలోచనలేమీ లేవు. కేవలం నడక. 'అరుణా లాండ్రీ, ఇక్కడ బట్టలు తెల్లగా ఉతకబడును' అన్న బోర్డు చూసేటప్పటికి గాని, తను అరండల్‌పేట పన్నెండో సుత్తై కొచ్చినట్లు అర్థం కాలేదు.

ఎవరో వెనకనుంచి వచ్చి వీపు తడితే అనుకోకుండా భయపడతామే, అలాంటి భయంతో ఒళ్ళు జలదరించింది ఆశీర్వాదానికి. మళ్ళీ బోర్డు చూశాడు. ఈ సారి పరీక్షగా. 'అరుణా లాండ్రీ, ఇక్కడ బట్టలు తెల్లగా ఉతకబడును.'


'అరుణా లాండ్రీలో బట్టలు తెల్లగా ఉతకడమేమిటి? ఇక్కడ బట్టలు ఎర్రగా చేయబడును అంటే సమంజసంగా ఉండేది.' తన కొచ్చిన ఆలోచనకి తనే నవ్వుకున్నాడు ఆశీర్వాదం.

అటూ ఇటూ కాసేపు తచ్చాడి, లోపలికి తొంగి చూశాడు. పెద్ద వరండా. వరండాలో ఒక పక్క మైలగుడ్డలు మూటలున్నాయి. మరో పక్క రెండు నులక మంచాలు. మంచాల మీద తెల్లగా ఉతికి ఆరేసిన బట్టలు. ఒక వెదురు బొంగు మీద అప్పుడే ఉతికిన నవారు ఆరేసి ఉంది, బొట్లు బొట్లుగా నీరు కారుతూ. వరండా లోపలి వైపున ఒక పెద్దబల్ల. బల్ల ముందు ఒక ముసలాయన నిలబడి ప్రపంచమేమీ తనకి పట్టనట్లు అదే లోకంగా ఇస్త్రీ చేస్తున్నాడు. బొగ్గుల ఇస్త్రీపెట్టె పక్కనున్న స్టూలు మీద పెట్టి, మధ్య మధ్య చుట్ట కాల్చుకుంటున్నాడు. ఆశీర్వాదం తన ఉనికిని తెలియజేస్తూ చిన్న పొడి దగ్గు దగ్గాడు. ముసలాయన పక్కకి తిరిగి చూశాడే గాని, పలకరించలేదు. తన పని తను చేసుకుపోతున్నాడు.

అంతలో ముసలాయన భార్య కావెనాసు లోపలి నుంచి గలగల మాట్లాడుతూ వచ్చి, 'ఎప్పుడు జెయ్యమన్నాడు నిన్నీ పని? మంచం దిగొద్దని డాక్టేరు సెప్పలా? బుద్ధి లేకపోతే సరి. ముసలోడి సేత పని జేయించి, సంపింది పెళ్ళాం ముండ అని ఊరంతా నన్నాడిపోసుకుంటానికా?' అంటూ లబలబ లాడుతూ, మొగుణ్ణి మేకపిల్లను గుంజినట్లు గుంజి లోపలికి తీసుకెళ్ళింది.

అలాగే నిలబడ్డాడు ఆశీర్వాదం.

'ఎవురయ్యా నువ్వు? ఆడు లేడు. మళ్ళీ రాపో' అన్నది, తిరిగి వస్తూనే ముసలమ్మ.



వాన

చిత్రం— ఎమ్. సత్యనారాయణ (బల్లిగూడ)

ఇలాంటివా రెవరైనా తన ఇంటికి వచ్చారంటే కొడుకు కోసమనే ఆమె అభిప్రాయం. ఇస్త్రీపెట్టె మూత తీసి, కాలిన బొగ్గుల తాలూకూ నుసి ఊది, రెండు కొత్త బొగ్గులు అందులో పడేసింది.

'ఎప్పు డొస్తాడు?'

'నాకేమన్నా సెప్పి పోయిండేంది?'

'ఎక్కడికి కెళ్ళాడు?'

'ఏట్లోకి' అంటూనే ఇస్త్రీ చేయ నారంభించింది ముసలమ్మ.

పని చేస్తూనే— 'ఆడు ఏటి కెందుకు పోతాడులే, ఇస్కూలికే పోతాడు. ఈడ ముసలోళ్ళం మేమున్నాంగా—అన్నీఅమిర్చి పెట్టటానికి. ఆడికేం? వలప బట్ట లేసుకుని టింగురంగా అని తిరుగుతాడు' అన్నది. స్కూలు కెళ్ళాడంటే, స్కూల్లో పని చేస్తున్నాడో లేక చదువుతున్నాడో అర్థం కాలేదు ఆశీర్వాదానికి. కాని, ఎలా అడిగి తెలుసుకోవడం?

'అయినా, సాకలాయనకి బడిపంతులు పనేంది?' నువ్వే చెప్పమన్నట్లు సూటిగా ఆశీర్వాదం కళ్ళలోకి చూసింది ముసలమ్మ.

ఆశీర్వాదం సమాధానమేమీ చెప్పకుండా చిన్న నవ్వు నవ్వి, ఈ మాత్రం క్లూ దొరకడంతో ఇక ప్రశ్నలవర్షం కురిపించాడు.

'ఎక్కడ పని చేస్తున్నాడు మీ అబ్బాయి? అంటే ఏ స్కూల్లో అని?'

'ఏ ఇస్కూల్లో మాయదారి ఇస్కూలు. నాకు తెలవదు.'

'మరేం లేదు. మా బావగారొకాయన —అయినా స్కూలు మాస్టరే— మీ అబ్బాయి దగ్గిరి కొచ్చి ఉంటున్నాట్ట. ఆయనగారికి మీ అబ్బాయి గారేదో ఉద్యోగం వేయిస్తా మన్నారట. ఆయన గారి కోసం, అంటే మా బావగారి కోసం వచ్చాను నేను. మరి మీ ఇంట్లో, మీ అబ్బాయితోపాటు కొత్తవా రెవరూ ఉండటం లేదా?'

'ఎవరెవరో వస్తుంటారు, పోతుంటారు. ఇది ధర్మసత్రంగంద! అడిగే దెవురూ, అజ కనుక్కునే దెవురూ? తిండి తినిపోతే సరేనయ్యా! నా కేమీ కోపం దాడు. బట్టలుతకాలా మనవ

అభిమానమైనా ఇంతే. చిన్న నిప్పు రవ్వ లాంటిది. అది ప్రేమను వెలిగించనూ గలదు, ద్వేషాగ్నుల రగిలించనూ గలదు.

లేకపోతే చౌదరికీ, అమృతరావుకీ శత్రుత్వమేమిటి? ఇంత అన్యాయంగా ప్రవర్తిస్తాడా చౌదరి? ఇద్దరూ ఒక పార్టీయే గదా. ఒక సిద్ధాంతం కోసమే పడి చస్తున్న మనుషులు గదా —అలాంటి అమృత రావుని పట్టి చంపమంటాడా చౌదరి? కేవలం మాలవాడై పుట్టిన కారణంగా మనిషిని చంపడమే!

ఆశీర్వాదం లేచి నిలబడ్డాడు. ఒక్క కిక్కుతో స్టార్టయింది మోటార్ సైకిల్. తిన్నగా అరండల్ పేట పన్నెండో లైను లోని అరుణా లాండ్రీ ముందు ఆగింది. అదృష్టవశాత్తు మోహనరావు— అంటే చాకలి మాస్టారు —ఇంట్లోనే ఉన్నాడు. లోపల, లోపల, ఇంకా లోపల గదిలోకి తీసుకుపోయి ఒక్కటి వేశాడు మోహనరావు మొహం మీద, తన బల కొద్దీ.

'గుర్తు పెట్టుకో. నేను అరండల్ పేట సర్కిలిన్‌స్పెక్టర్ని. ఈ వేళ రాత్రి ఒంటి గంటకు మీ ఇంటి మీద దాడి చేస్తున్నాం.' అంతే. అంతకంటే ఎక్కువేమీ మాట్లాడలేదు. తిరిగి మోటార్ సైకిలెక్కి పోలీస్ స్టేషను కొచ్చాడు ఆశీర్వాదం.

ప్లాను ప్రకారమే ఆ రోజు రాత్రి ఒంటి గంటకు పకడ్బందీగా దాడి జరిగింది. జిల్లా కమ్యూనిస్టు నాయకుడైన హరిజన అమృతరావు దొరకలేదు సరికదా— కాగితాలు వెదుకుతున్న సందర్భంలో ఒక కాన్‌స్టేబుల్‌కి రెండు తేళ్ళు కుట్టాయి.

* * *

'కథ ఇక్కడితో ఆపినా బాగుండేది' అనుకున్నాడు క్రాంతికుమార్. కాని, ఆపలేదు ఆ రియాక్షనరీ కమ్యూనిస్టు రచయిత.

ముగింపు పేరాగ్రాఫు ఇలా ఉంది: కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగింది. ఎన్నికలొచ్చాయి. గుంటూరు నియోజక వర్గానికి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా నిలబెట్టబడిన చౌదరి అఖండ విజయంతో ఎమ్. ఎల్. ఎ. గా ఎన్నికయ్యాడు. ఇది చూసిన అమృతరావు తన కింక పార్టీలో స్థానం లేదని కమ్యూనిస్టు పార్టీకి రాజీనామా చేసి సినిమాలలో చేరిపోయాడు. అమృత రావు పెద్ద రాజకీయవేత్తే గాక, గొప్ప డప్పు విద్వాంసుడు గూడా. ఆ డప్పు వాద్యమే తన కిప్పుడు ఇంత కూడు పెడుతున్నది.

* * *

గొప్ప రియాక్షనరీ కథ! ఇలా పూర్తయింది.


'ఇది రియాక్షనరీ కథో, కాదో నాకు తెలియదు గాని, వాస్తవంగా జరిగిన కథ ఇది. నాకు జరిగిన కథ అంటూ రాశాడు ఈ 'ద్రోహం' కథానికా రచయిత తన ఉత్తరానికి సమాధానంగా.

'కామ్రేడ్! ప్రపంచంలో అనేకం జరుగుతుంటాయి. అన్నీ కాగితం మీద పెట్టగలమా? పెట్టడం మంచిదా? ఎక్కడో ఏ మూలనో ఒక తల్లి తన కొడుకుతో వ్యభిచరిస్తున్నదని కథ రాయగలమా? నిజమే అయినా, అలాంటి కథ వ్రాయడం మంచిదా? ఆరోగ్యకరమా? తమ హక్కులకోసం సమ్మె చేస్తున్న కూలీలు — ఆకలి మంటలతో అలమటిస్తున్న — సమ్మెను జయప్రదం చేస్తున్నారని వ్రాయడం మంచిదిగానీ, సమ్మెలో కొడుకుని పోగొట్టుకున్న కొండయ్య లొంగిపోయాడని చెప్పడం అనారోగ్యకరం. నిజంగా ఈ రోజు లొంగిపోయినా, రేపు సమ్మెలో కలుస్తాడు. నిలుస్తాడు. ముందుకు నడిపించేదీ, కళ్ళకు వెలుగిచ్చేదీ వ్రాయాలి గాని, ఇలా కనుగుడ్లనే పాడిచేసే ప్రయత్నం చేయకూడదు' అని తిరిగి సమాధానం వ్రాశాడు క్రాంతికుమార్.

'అవును. అలాంటివి జరక్కుండా ఉండేందుకుగానే నే నీ కథ వ్రాసినట్లు ఎందు కనుకో గూడదు?'

''నిజమే. ఎందుకు కనుకోకూడదు? అలాంటి అన్యాయా లింక జరగకుండా ఉండుగాక! నా దేశం, నా ప్రజలు ఇంకా ముందుకే మున్ముందుకే సాగిపోవుగాక!''

శీర్షమెత్తి నిలబడ్డ అభ్యుదయ రచయిత క్రాంతి కుమార్, కళ్ళు మూసుకుని ధ్యాన ముద్రలో మగ్నమైపోయాడు. ★



నావ

చిత్రం— యమునాబాయి

( రాజపాళయం )